క్లుప్తంగా

క్షయవ్యాధి పట్ల అప్రమత్తత అవసరం



తెనాలిఅర్బన్: క్షయ వ్యాధి అంటు రోగమని, అప్రమత్తంగా ఉండాలని తెనాలి జిల్లా వైద్యశాల పీపీ యూనిట్ వైద్యురాలు డాక్టర్ రమాదేవి పేర్కొన్నారు. సీడీపీఓ కార్యాలయంలో మంగళవారం క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. రమాదేవి మాట్లాడుతూ పిల్లలకు, గర్భిణులకు క్షయ ఎక్కువగా సోకే అవకాశం ఉందన్నారు. మందులను సక్రమంగా వాడితే పూర్తిగా నియంత్రించవచ్చని చెప్పారు. టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పల్లెకొండ రవికుమార్ మాట్లాడుతూ క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో సీడీపీఓ ఎం.సునీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కత్తెర పురుగు ఆశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



కొల్లిపర: రైతులు మొక్కజొన్న, జొన్న పంటల్లో కత్తెర, కాండం తొలుచు పురుగులు ఆశించకుండా సరైన మందులు, యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు అని జిల్లా వ్యవసాయాధికారి నున్నా వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం శిరిపురం, కొల్లిపర గ్రామాల్లో ఈ–పంట నమోదు, పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏఓ కె.వెంకటరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కత్తెర పురుగు, కాండం తొలుచు పురుగు నివారణకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఓ కె.వెంకటరావు, విస్తరణ అధికారులు పి.మురళి, ఎం.ఆదిలక్ష్మి, ఉద్యాన సహాయకులు కె.సుధీర్, రవితేజ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'లక్ష డప్పులు వేయి గొంతులు'ను జయప్రదం చేద్దాం



తెనాలిరూరల్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కోరుతూ ఈనెల 7న హైదరాబాద్‌లో జరుగనున్న లక్ష డప్పులు, వేయి గొంతులు కార్యక్రమాన్ని మాదిగలందరూ జయప్రదం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండముది బోసుబాబు పిలుపునిచ్చారు. స్థానిక మారిస్‌పేట ఎరువుల కొట్ల బజారులలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేకల సురేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ప్రకటన చేయాలని కోరారు. అనంతరం లక్ష డప్పులు వెయ్యి గొంతులు కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నలుకుర్తి సద్గుణరావు, అలపర్తి చిన్నా, పినపాటి వందన్‌రాజు, బడుగు సురేష్, కఠెవరపు శరత్, తెనాలి రాజేష్, కొత్తపల్లి చిరంజీవి, పేరిపోగు ఆదాం తదితరులు పాల్గొన్నారు.

9న వినాయక ఆలయ వార్షికోత్సవం

కొల్లిపర(వల్లబాపురం): వల్లబాపురంలో ఈనెల 9న వినాయక ఆలయ 113వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు దేవాలయం వ్యవస్థాపక ధర్మకర్త అచ్యుత ఇందు శేఖర్ తెలిపారు. మంగళవారంఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 9న ఉదయం 10 గంటలకు ఆలయంలోని ఆవరణలో విశ్వశాంతి యజ్ఞం వైదిక ప్రచారకులు గొడవర్తి కోటేశ్వరరావు చేతుల మీదుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 10న 11గంటలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల మేధావి గుణశ్రీచే గణిత అవధాన ప్రదర్శన చేయించనున్నట్లు వెల్లడించారు.

'స్వచ్ఛ తెనాలి' సాధనలో భాగస్తులు కావాలి



తెనాలిఅర్బన్: స్వచ్ఛ తెనాలి సాధనలో అందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతిరావు సూచించారు. పట్టణంలోని 3, 5 వార్డులలో మంగళవారం జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను ఆయన పరిశీలించారు. రోడ్ల వెంట వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. కాల్వలను బాగు చేయాలని సూచించారు. కాల్వలపై ఆక్రమణలు ఉంటే వెంటనే తొలగించాలని ఆదేశించారు.

అగ్నిపరీక్ష

- ఆరు మండలాల పరిధికి ఒకే శకటం
- సమస్యల వలయంలో తెనాలి అగ్నిమాపక కార్యాలయం
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- సౌకర్యాలు కరువు



తెనాలిలోని అగ్నిమాపక కార్యాలయం

తెనాలిరూరల్: తెనాలి అగ్నిమాపక శాఖ కార్యాలయం సమస్యల వలయంలో చిక్కుకుని కునారిల్లుతోంది. సిబ్బంది కొరతతో సతమతమవుతోంది. ఆరు మండలాల పరిధికి కేవలం ఒక్క శకటం మాత్రమే ఉండడంతో ఒకేసారి రెండుసార్లు ప్రమాదాలు జరిగితే చేతులెత్తేయాల్సిన దుస్థితి దాపురించింది. సిబ్బంది పనిభారంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ అగ్నిమాపక కార్యాలయం చాలా పురాతనమైంది.

అగ్నిమాపక అధికారి పోస్టూ ఖాళీ!

ఆరు మండలాల పరిధిలో ఈ కేంద్ర సిబ్బంది ఎన్నోమార్లు పెను ప్రమాదాలను నివారించి ప్రజల అభినందనలు అందుకొన్నారు. ఇక్కడ మొత్తం 31 మంది సిబ్బంది అవసరం. అగ్నిమాపక అధికారితోపాటు 21 మంది ఫైర్‌మెన్, నలుగురు లీడింగ్ ఫైర్‌మెన్‌లు, ఐదుగురు డ్రైవర్లు ఉండాలి. అయితే కీలకమైన అగ్నిమాపక అధికారి పోస్టూ ఖాళీగా ఉంది. ఫైర్‌మెన్, డ్రైవరు పోస్టులు భర్తీ కావాల్సి ఉంది. 31 మందికి 15 పోస్టులు ప్రస్తుతానికి ఖాళీనే. ఈ కేంద్రంలో కేవలం ఒకేఒక్క అగ్నిమాపక వాహనం ఉంది. రెండు దశాబ్దాల క్రితం రెండో వాహనం సమకూర్చినా ప్రస్తుతం ఒక వాహనం మూలన పడింది. దీనివల్ల వేర్వేరు చోట్ల ఒకేసారి ప్రమాదం జరిగితే సిబ్బంది సకాలంలో వెళ్లలేని దుస్థితి నెలకొంది. మంగళగిరి, పొన్నూరు, బాపట్ల ప్రాంతాల్లో భారీ ప్రమాదాలు జరిగినప్పుడు తెనాలి వాహనాన్నే పంపుతారు. అయినా ఈ కేంద్రంపై పాలకులు శ్రద్ధ చూపడం లేదు. రానున్న వేసవి సీజన్ నేపథ్యంలో వెంటనే సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించి, మరో వాహనాన్ని సమకూర్చాలని స్థానికులు కోరుతున్నారు.

మిస్ట్‌తో కొంత ఊరట..

గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది జనవరి 31వ తేదీ వరకు తెనాలి అగ్నిమాపక కేంద్రం పరిధిలో 112 ప్రమాదాలు జరిగాయి. రూ.75,65,000 విలువైన ఆస్తి నష్టం సంభవించింది. సుమారు రూ.1,65,20,000 విలువైన ఆస్తిని కాపాడగలిగారు. తెనాలి అగ్నిమాపక శాఖ కార్యాలయానికి అత్యాధునిక మిస్ట్ వాహనాన్ని కేటాయించారు. చిన్నచిన్న సందుల్లోని ఇళ్లు, దుకాణాలు తదితర ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు సంభవిస్తే ఈ వాహనం త్వరగా అక్కడికి చేరుకుని, మంటలను అదుపు చేస్తుంది. ఈ వాహనం వల్ల కొంత ఊరట కలుగుతోంది. పెద్ద ప్రమాదాల అదుపునకు మిస్ట్ సేవలు సరిపోవు. అందుకే మరో వాహనం సమకూర్చాలని సిబ్బంది కోరుతున్నారు.

సిబ్బందికి వసతులు అరకొరే..

కేంద్రంలో వసతులూ సరిగా లేవు. కార్యాలయ భవనం ఎప్పుడో స్వాతంత్య్ర రాక ముందు నిర్మించినది. ఇప్పటికీ సిబ్బంది ఉండేందుకు గది లేదు. 85 ఏళ్లక్రితం నిర్మించిన ఓ గదిలో కేవలం నలుగురుకన్నా ఎక్కువ మంది సిబ్బంది కూర్చునే వీలు లేదు. ఇక వర్షం కురిసిందంటే ఈ గది తటాకాన్ని తలపిస్తుంది. శ్లాబు నుంచి నీరు కుండపోతగా కారుతుంది. అధునాతన భవన నిర్మాణాన్ని 2018లో ప్రారంభించినా పనులను కాంట్రాక్టర్ మధ్యలోనే ఆపేశాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తెనాలి అగ్నిమాపక కేంద్రం సమస్యలపై దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.

క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే నయం చేయొచ్చు



మాట్లాడుతున్న డాక్టర్ డి.శారద

తెనాలి: ఆధునిక వైద్యవిజ్ఞానంతో క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించే అత్యాధునిక పరీక్షలు, వ్యాధి రాకుండా ముందస్తుగా కట్టడి చేసే వ్యాక్సిన్లు కూడా ప్రస్తుత కాలంలో అందుబాటులో ఉన్నాయని పట్టణానికి చెందిన స్వచ్ఛంద సేవాసంస్థ శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద చెప్పారు. ప్రపంచ క్యాన్సర్ డేను పురస్కరించుకుని మంగళవారం స్థానిక కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిర మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. మహిళల్లో వచ్చే రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌పై డాక్టర్ శారద అవగాహన కల్పించారు. మరీ ముఖ్యంగా తొమ్మిదేళ్ల నుంచి పద్నాలుగేళ్లలోపు వయసు బాలికలు హెచ్‌పీవీ వ్యాక్సినును రెండు డోసులు తీసుకోవటం ద్వారా భవిష్యత్‌లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రాకుండా నిరోధించవచ్చని చెప్పారు. అలాగే మహిళల్లో 45 ఏళ్లలోపు వయస్కులు హెచ్‌పీవీ వ్యాక్సినును మూడు డోసులు తీసుకుంటే క్యాన్సర్ రాకుండా ముందస్తుగానే అరికట్టవచ్చని తెలిపారు. ప్రతి విద్యార్థిని క్యాన్సర్ వ్యాధి గురించి, లక్షణాలను ముందుగా గుర్తించటంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సదస్సులో స్కూల్ ప్రధానోపాధ్యాయిని ఎస్.రాజ్యలక్ష్మి, న్యాయవాది కనపర్తి బెన్‌హర్, బీటీవీఎస్ నారాయణ, ఏవీ ప్రసాద్, ఆలపర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండండి



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ కిషోర్, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు

తెనాలిఅర్బన్: క్యాన్సర్ పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ దివి కిషోర్‌కుమార్, అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో అవగాహన ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొలి దశలో క్యాన్సర్‌ను గుర్తించగలిగితే దానిని పూర్తిగా నయం చేసే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో స్క్రీనింగ్ టెస్టులు ఉచితంగా చేస్తున్నట్లు చెప్పారు. అనుమానితులు ఎవరైనా ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆశా డేను పురస్కరించుకుని సాలిపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో సమావేశాన్ని నిర్వహించారు. కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని తెలిపారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ నెల 10వ తేదీన నులిపురుగుల నివారణ మాత్రలను ప్రతి ఒక్కరికీ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గర్భిణుల వివరాలను వెంటనే నమోదు చేసి ప్రభుత్వ వైద్యశాలలో జరిగే ప్రసవాలను ప్రోత్సాహించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మహిత, వివిధ ఉద్యోగులు అందె బాలచంద్రమౌళి, వెంకటేశ్వరమ్మ, ప్రసన్న, పుష్పలత, నవీద్ తదితరులు పాల్గొన్నారు.

10న సుబ్రహ్మణ్య క్షేత్రంలో గుడి నిర్మాణానికి శంకుస్థాపన




ఆహ్వానపత్రికను ఆవిష్కరించిన సుబ్రహ్మణశర్మ

తెనాలి: పెదరావూరులో మహా విద్యాపీఠం ఆధ్వర్యంలో అభయహస్త సుబ్రహ్మణ్య క్షేత్రంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఈనెల పదో తేదీన శ్రీలక్ష్మీగణపతి, శ్రీబాలాంబిక సమేత శ్రీసర్వహితేశ్వరస్వామి వార్ల నూతన దేవాలయ సముదాయ నిర్మాణానికి చేస్తున్న శంకుస్థాపన మహోత్సవ ఆహ్వాన పత్రికను స్వామివారి సన్నిధిన ఆవిష్కరించారు. మహావిద్యాపీఠం స్థాపకులు సుబ్రహ్మణశర్మ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి తొలి ప్రతిని గ్రామానికి చెందిన రైతు పాలడుగు లక్ష్మణరావుకు అందజేశారు. అనంతరం వివరాలను తెలియజేశారు. పెదరావూరు– జంపని గ్రామాల మధ్య సుబ్రహ్మణ్యపురంలోని శ్రీఅభయహస్త సుబ్రహ్మణ్య క్షేత్రానికి ఈశాన్య భాగంలో శ్రీసర్వహితేశ్వరుడు (శివాలయం) దేవాలయాన్ని నిర్మించ తలపెట్టినట్టు చెప్పారు. కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య శ్రీశంకర విజయేంద్ర సరస్వతీ మహాస్వామి సూచన ప్రకారం గణపతి, బాలాంబిక సమేత సర్వహితేశ్వరుడి దేవాలయ నిర్మాణం తలపెట్టినట్టు వివరించారు. పదో తేదీన ఉదయం 11.12 గంటలకు శంకుస్థాపన మహోత్సవం జరుగుతుందని తెలిపారు. ఆహ్వాన పత్రిక ఆవిష్కరణలో లక్ష్మీనరసింహమూర్తి, శుభం శర్మ, భక్తులు పాల్గొన్నారు.

సేవా భగవాన్ పురస్కారాలకు అప్పారావు, శివశంకర్ ఎంపిక



తన్నీరు శివశంకర్



ఈఎల్‌వీ అప్పారావు

తెనాలిఅర్బన్: జయజయ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రదానం చేయనున్న సేవా భగవాన్ పురస్కారాలకు తెనాలికి చెందిన తన్నీరు శివశంకర్, ఈఎల్‌వీ అప్పారావు ఎంపికయ్యారు. ఈ మేరకు ట్రస్ట్ నిర్వాహకులు పూసలపాటి బాలాజీ నుంచి ఆహ్వాన పత్రం అందినట్లు శివశంకర్ తెలిపారు. ఈ నెల 9న చిలకలూరుపేటలోని మెడికల్ అసోసియేషన్ హాల్‌లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చేతులు మీదుగా అవార్డులు ప్రదానం జరగనున్నట్లు వివరించారు. అవార్డులకు ఎంపికైన వీరిని పలువురు అభినందించారు.

కోళ్ల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ తప్పనిసరి

రేపల్లె రూరల్: కోళ్ల పెంపక పరిశ్రమ రైతులు తమ కోళ్ల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని పశు సంవర్ధక శాఖ రేపల్లె సహాయ సంచాలకుడు నాంచారయ్య సూచించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. వైరస్‌తో ఉమ్మడి గోదావరి జిల్లాలో నాటు, బ్రాయిలర్, లేయర్ కోళ్లు పెద్ద ఎత్తున మృతి చెందాయని చెప్పారు. వైరస్ నిర్ధారణకు వాటి అవశేషాలను పుణేలోని వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు పంపడం జరిగిందన్నారు. పట్టణ పరిసరాల్లోని కోళ్ల పెంపకం రైతులు తమ కోళ్ల పరిశ్రమలో పరిశుభ్రతను పాటించాలని సూచించారు. దీనిలో భాగంగా షెడ్లలో బ్లీచింగ్ పౌడరు ఒక రోజు చల్లించాలని, మరో రోజు ఫినాయిల్‌తో శుభ్రపరచాలని చెప్పారు. చనిపోయిన కోళ్లను ఎట్టి పరిస్థితుల్లో తినకూడదని స్పష్టం చేశారు. వీటిని కాల్వలలో, రోడ్డు మార్జిన్‌లలో పడవేయకూడదని చెప్పారు. మూడు అడుగుల గొయ్యితీసి పాతిపెట్టాలని సూచించారు. ప్రజలు అనవసరమైన వదంతులను నమ్మకుండా ఆరోగ్యంగా ఉన్నటువంటి కోళ్లను, కోడి గుడ్లను తినవచ్చని చెప్పారు. ఈ వైరస్ మనుషులకు, పశువులకు సోకినట్లు నిర్ధారణ కాలేదని స్పష్టం చేశారు.

ఆధ్యాత్మిక 'సౌర'భం



సూర్య యంత్రం ఎదుట పూజలు



శరణాగతి గోష్టి పీఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో సూర్యుడికి పాయసం సమర్పణ



బహుమతులతో విజేతలు, నిర్వాహకులు



సూర్యనమస్కారాల పోటీలు

తెనాలి: స్థానిక బాలాజీరావుపేటలోని ప్రధాన అయ్యప్ప ఆలయంలో రథసప్తమి వేడుకను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సప్త వర్ణాలతో 14 అడుగుల కైవారంతో సూర్య యంత్రాన్ని తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు ఆదిత్య హృదయ పారాయణం, లలితా సహస్ర పారాయణం సామూహికంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు దుర్భా హరిబాబుశాస్త్రి సూర్యయంత్రాన్ని తీర్చిదిద్దారు. ఆరోగ్య భాస్కర అనుగ్రహ సిద్ధికి ఏటా రథసప్తమి ప్రత్యేక పూజలు చేస్తున్నట్టు తెలిపారు.

– పట్టణానికి చెందిన శరణాగతి గోష్టి పీఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో పీఠాధిపతి శ్రీనరేంద్ర రామానుజదాస స్వామిజీ మంగళ శాసనాలతో మంగళవారం రథసప్తమి వేడుకలను నిర్వహించారు సూర్యకిరణాలు పడేలా మంత్రాలు జపిస్తూ పాయసాన్ని తయారు చేసి సూర్యునికి సమర్పించి భక్తులకు ప్రసాదంగా అందించారు. 12సార్లు ఆదిత్య హృదయ పారాయణం చేశారు. భక్తులకు అన్నప్రసాదం అందించారు. విష్ణుమొలకల వాలేశ్వరరావు, తన్నీరు సీతారామయ్య, రాఘవేంద్రరావు, సమరసత సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, కడియాల సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సూర్య నమస్కారాల పోటీలు

క్రీడాభారతి యోగభారతి ఆధ్వర్యంలో రథసప్తమి సందర్భంగా మంగళవారం స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం ప్రాంగణంలో విద్యార్థులకు సూర్యనమస్కారాల పోటీలను నిర్వహించారు. విశ్రాంత పీఈటీ ప్రభల మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో పదిహేనేళ్లుగా ఏటా రథసప్తమి రోజున ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది పట్టణంలోని 20 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. బాలురు, బాలికల్లో సీనియర్, జూనియర్స్ చొప్పున మొత్తం నాలుగు విభాగాల్లో ఈ పోటీలను జరిపారు. సరస్వతీ శిశు మందిర్, ప్రశాంతి ఇంగ్లిష్ మీడియం స్కూల్, ఏబీసీ స్కూల్, నాగార్జున స్కూల్, కేఎస్ఎస్ఎం స్కూలు విద్యార్థులు బహుమతులను గెలుచుకున్నారు. విజేతలకు షీల్డు, మెడల్, ప్రశంసాపత్రాలను అందజేశారు. ప్రభల మల్లికార్జునశర్మతోపాటు ఆర్ఎస్ఎస్ నగరసాహ చీదెళ్ల పవన్ కుమార్, హిందూ చైతన్యవేదిక రాష్ట్ర కో–ఆపరేటర్ అంబటి మారుతిరామ్, ఆర్ఎస్ఎస్ జిల్లా శారీరక ప్రాముఖ్ పొత్తూరి మోహనరావు, లక్ష్మీనారాయణ, హనుమంతరావు, తన్నీరు శివశంకర్ పర్యవేక్షించారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది



తెనాలి: మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని రూరల్ మండల గ్రామాలైన కోపల్లె, అంగలకుదురుల్లో నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి జి.ప్రేమసాగర్ పంచాయతీ కార్యాలయాల్లో ముందుగా గ్రామ సభలు జరిపి, మొక్కజొన్న చేలను సందర్శించారు. మొక్కజొన్న పైరులో వచ్చే పురుగు, తెగుళ్లను పరిశీలించారు. రైతులకు అవసరమైన నివారణ చర్యలను సూచించారు. వ్యవసాయ ఏఏఏలు అనిషా, సాయిదీపిక, రైతులు పాల్గొన్నారు.

బోధన పద్ధతి మెరుగుకు 'టీచ్ టూల్'



తెనాలిఅర్బన్: ఉపాధ్యాయుల్లో బోధన నైపుణ్యాన్ని మెరుగు పరిచేందుకు టీచ్ టూల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు మేకల లక్ష్మీనారాయణ, వి.జయంతిబాబు పేర్కొన్నారు. కొత్తపేటలోని ఎంఈఓ కార్యాలయంలో టీచ్ టూల్ ప్రోగ్రామ్ అబ్జర్వర్స్‌తో మంగళవారం సమావేశం నిర్వహించారు. టీచ్ టూల్ స్టేట్ అబ్జర్వర్ తోట వీరయ్య మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో లోపాలు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

మోడల్ రోడ్డుగా తీర్చిదిద్దుతాం



తెనాలిఅర్బన్: గంగానమ్మపేట శశి ప్రొవిజన్‌కు వెళ్లే రోడ్డును మోడల్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. గంగానమ్మపేటలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. అనంతరం సత్రంలో వ్యాపారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ రోడ్డును తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా రోడ్డు విస్తరణ పనులు చేస్తున్నట్లు చెప్పారు. మురుగు కాల్వలు కూడా ఆధునీకీకరిస్తామన్నారు. సమావేశంలో ఏసీపీ శివన్నారాయణ, ఇన్‌చార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి



పెదపూడిలో రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ లక్ష్మి



రైతులకు సూచనలిస్తున్న ఏవో రమేష్‌బాబు

అమర్తలూరు(వేమూరు): జొన్న, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్న రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని బాపట్ల డివిజనల్ సహాయ వ్యవసాయాధికారి లక్ష్మి అన్నారు. అమర్తలూరు మండలంలోని పెదపూడి, మూల్పూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విచక్షణా రహితంగా నత్రజని ఎరువుల వినియోగం వల్ల భూసారం దెబ్బతింటుందన్నారు. సేంద్రియ కర్బనం తగ్గిపోయి పంటలు పండని పరిస్థితి నెలకొంటుందన్నారు. భూసార పరిరక్షణకు పచ్చి రొట్ట పైరు సాగు చేయాలని రైతులకు సూచించారు. మండల వ్యవసాయాధికారి ఉయ్యూరి లోకేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

నగరం: మినుములో మారుకా మచ్చల పురుగు నివారణపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయాధికారి వి.రమేష్‌బాబు పేర్కొన్నారు. ఈదుపల్లి, పెదమట్లపూడి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయశాఖాధికారులు పర్యటించి రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పూత, పిందె దశలో మారుకా మచ్చల పురుగు అపార నష్టం కలిగిస్తుందన్నారు. పైరు పూత దశకు రాక ముందే ఈ పురుగు నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. పూత దశలో 5 శాతం వేప గింజల కషాయం లేదా వేప నూనె 5 మి.లీ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఏఈవో నాగశ్రీనివాసరావు, వీఏఏలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రైలు ప్రయాణికుడి మృతి

తెనాలిరూరల్: రైలు నుంచి జారి పడి గాయాలపాలైన ప్రయాణికుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. చీరీలకు చెందిన భాస్కర్(48) నిడుబ్రోలులోని రైతుబజార్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం రైలులో ప్రయాణిస్తూ తెనాలి స్టేషన్‌లో రైలు నుంచి జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని పోలీసులు వైద్యశాలకు పంపగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు మంగళవారం అప్పగించారు. తెనాలి జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు దృష్టి లోప పింఛన్‌దారుల రీవెరిఫికేషన్

కొల్లిపర: ప్రభుత్వం ఆదేశాల మేరకు తెనాలి ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దృష్టిలోప పింఛన్‌దారులను వైద్యుల సమక్షంలో పునఃపరిశీలించనున్నట్టు ఎంపీడీవో వి.విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతూ మొత్తం 38 మందికి వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షునిగా సాంబశివరావు



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో గౌరవాధ్యక్షుడు రవికుమార్

తెనాలిఅర్బన్: తెనాలి వీడియోగ్రాఫర్స్ అండ్ ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షునిగా సుద్దపల్లి సాంబశివరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆంధ్రప్యారిస్ స్టూడియోలో మంగళవారం కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. గౌరవాధ్యక్షుడు కూరపాటి రవికుమార్ పర్యవేక్షణలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు నాయకులు చెప్పారు. కార్యదర్శి వి.మణికాంత్, ట్రెజరర్‌గా చందలూరి చంద్రశేఖర్, ఉపాధ్యక్షునిగా కాళిదాసు గౌతమ్, సంయుక్త కార్యదర్శులుగా పుట్టగొట్టు దీపక్ సాయి, వెదురుపర్తి రవిచంద్రలను ఎన్నుకున్నట్లు తెలిపారు. వీరందరికీ అభినందనలు తెలియజేశారు.

న్యాయం చేయండి..రక్షించండి

కొల్లూరు: తమపై దౌర్జన్యానికి పాల్పడిన టీడీపీ నాయకుడి నుంచి రక్షించి, న్యాయం చేయాలని బాధిత రైతు కుటుంబం అధికారులకు మొరపెట్టుకుంది. బాధిత కుటుంబం వివరాల మేరకు.. మండలంలోని జువ్వలపాలెం శివారు గుంటూరుగూడేనికి చెందిన మారీదు ప్రసాద్ సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను జువ్వలపాలేనికి చెందిన వేములపల్లి రవికిరణ్ ధ్వంసం చేశారు. తన అనుచరులతో తమపై దౌర్జన్యం చేసి గాలు మార్గం ఏర్పాటు చేయడంపై మంగళవారం తహసీల్దార్ బి. వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. తమ పక్క పొలానికి చెందిన టీడీపీ నాయకుడు వేములపల్లి రవికిరణ్ పోలీసులు, సుమారు 70 నుంచి 80 మంది వరకు రౌడీలను మొహరించి తమ భూమిని స్వాధీనం చేసుకున్నారని బాధితులు ఆరోపించారు. తన పంట పొలానికి అక్రమంగా మార్గం ఏర్పాటు చేసుకున్నారని తహసీల్దార్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొక్లేన్‌తో మొక్కజొన్న పంటను ధ్వంసం చేయడంతో పాటు, విద్యుత్తు మోటారు, పొలానికి సాగునీరు అందించే పైప్‌లైన్‌లను పగలకొట్టి దౌర్జన్యానికి దిగారని వాపోయారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కొల్లూరు పోలీసు స్టేషన్‌లో సైతం తమకు జరిగిన అన్యాయంపై న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. బాధిత రైతు కుటుంబానికి మద్దతుగా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సుగ్గున మల్లేశ్వరరావు అధికారులను కలిశారు. తగిన న్యాయం చేయాలని కోరారు.